సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

దసరా సెలవులు ప్రారంభం అయ్యాయి. సొంత ఊళ్లకు వెళ్లే ముందు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. 10లో▸

రేపటి ప్రజావాణి రద్దు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు.



న్యూస్‌రీల్

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా కానుక

మహేశ్వరం: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకు, 28 నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. తుక్కుగూడ బస్టాండ్‌లో 10 మంది పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,990 విలువ చేసే నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. మహిళా, పురుష ప్రయాణికులకు వేర్వేరుగా డ్రా బాక్స్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మొయినాబాద్: పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉప కార్యదర్శి వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గురుకులంలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు రెండో రోజు శనివారం రసవత్తరంగా కొనసాగాయి. వివిధ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. క్రీడాపోటీలను ప్రత్యక్షంగా వీక్షించిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. గురుకులాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రాంతీయ క్రీడాధికారి ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక



డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికా గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ, అంతర్జాతీయ ఫిలంత్రోఫిక్ సొసైటీ, శ్రీశ్రీ కళావేదిక, పుడమి సాహితీ వేదిక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీ, పాండిచ్చేరి తెలుగు అసోసియేషన్లు సంయుక్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి జాతీయ పురస్కారాలను అందజేస్తున్నాయి. ఈ సందర్భంగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తుండంతో పాటు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా కొనసాగుతూ విద్యార్థులతో కలిసి సామాజిక అభివృద్ధికి పాటు పడుతున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 18న న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో జరిగే ఢిల్లీ తెలుగు కళా దర్బార్ కార్యాలయంలో అందుకోనున్నారు.

అప్రెంటిషిప్ మేళాను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న అప్రెంటిషిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి కోరారు. ఈనెల 16న కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి మేళా ప్రారంభం అవుతుందని తెలిపారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులకు ఈ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మేళాకు వచ్చే విద్యార్థులు విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం

అబిడ్స్/నాంపల్లి: భారతదేశ సర్వతో ముఖాభివృద్ధి, భారతీయుల శ్రేయస్సుతో పాటు భాగ్యనగర్ ప్రజల హితం కాంక్షిస్తూ లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు మాధవీలత తెలిపారు. నగరంలోని సీతారాంబాగ్ శ్రీరామ దేవస్థాన ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఆలయంలోనే నిర్వహించే యజ్ఞం నవంబర్ 27 వరకు 45 రోజులపాటు కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. పలు హిందూ ధార్మిక సంస్థలతో కలిసి భాగ్యనగరంలో హిందువుల హితం కోరుతూ ఈ యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. 45 రోజుల పాటు 'సర్వకార్యసిద్ధి సహస్ర చండీ సహిత మహా రుద్ర కామేశ్వర కామేశ్వరి యాగం' జరుగుతుందని చెప్పారు.



చేవెళ్ల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూల వేడుక.. షురూ ఇక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం తొలిరోజు ఎంగిలిపూల ఉత్సవాలు నిర్వహించారు. యువతులు, మహిళలు అందంగా ముస్తాబై.. తీరొక్క పూలతో బతుకమ్మలను మురిపెంగా పేర్చి ఒకచోటికి చేర్చారు. ఆటపాటలతో.. కోలాటాలు.. నృత్యాలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.




ఆమనగల్లు: సందడిగా సంబరాలు, బతుకమ్మతో చిన్నారి

ఎన్నికల వేళ.. ఆతిథ్య మేళా!

అప్పుడే ఈవినింగ్ 'పార్టీ'లు షురూ

- కాలనీ, యువజన, ఉద్యోగ, కార్మిక సంఘాలతో సమావేశాలు
- కన్వెన్షన్లు, ద్వితీయ శ్రేణి నేతల ఇళ్లు, ఆఫీసుల్లో దావత్‌లు
- ఓటర్లను మచ్చిక చేసుకునే యత్నాలు
- ముమ్మరంగా బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అధికార బీఆర్‌ఎస్ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. కోడ్ వచ్చే వరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల పంపిణీతో బిజీగా మారిన ఆ పార్టీ అభ్యర్థులు తాజాగా ఓటర్లను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం వేళ ఇతర పార్టీల కార్యకర్తలకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పడం.. మధ్యాహ్నం బూత్, గ్రామ, మండల స్థాయి కమిటీలతో సమావేశాలు నిర్వహించడం.. ఎన్నికల్లో విజయం కోసం సమాలోచనలు చేయడం.. సాయంత్రం ఏడు తర్వాత అనుచరుల నివాసాలు, ఆఫీసులు, కన్వెన్షన్ సెంటర్లు, ఫాం హౌసుల్లో గెట్ టు గెదర్ పార్టీల్లో మునిగి తేలుతున్నారు. కాలనీ, అపార్ట్‌మెంట్, గెటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తున్నారు. వివిధ రకాల మాంసాహారవంటకాలతో పాటు ఖరీదైన మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. ఒకవైపు అభ్యర్థి గెలుపునకు ఏ విధంగా కృషి చేయాలనే అంశంపై చర్చిస్తూనే.. మరోవైపు సుక్క..ముక్కతో ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఎల్‌బీనగర్, మహేశ్వరం, నియోజకవర్గాల్లో ఈ దావత్‌లు ఎక్కువ జరుగుతున్నట్లు సమాచారం.

ముందు బర్త్‌డే బ్యానర్.. వెనుక పొలిటికల్ దావత్

ఒకేచోట ఎక్కువ మంది కూడితే ఎన్నికల కమిషన్‌కు అనుమానం వస్తుందని భావించి, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విశేషం. పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా పుట్టిన రోజు వేడుకల బ్యానర్లను, కేకు, పుష్పగుచ్ఛాలను ఆ ప్రదేశంలో రెడీగా ఉంచుతున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో ప్రచారం కోసం బంధువులు, స్వగ్రామాలకు చెందిన వారిని కూడా నియోజకవర్గానికి రప్పించి, వారితో మంతనాలు జరుపుతున్నారు. స్థానికంగా స్థిరపడిన వారి బంధువుల ఓట్లు బీఆర్‌ఎస్‌కే పడేలా ప్లాన్ చేస్తున్నారు. ఏ ఒక్కరోజు కూడా పలకరించని నేతలు ఏకంగా నియోజకవర్గానికి పిలిపించుకుని విజయం కోసం పాటు పడాల్సిందిగా వేడుకుంటున్నారు. లీడర్లు కూడా దీన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. అభ్యర్థుల ముందు అనేక ప్రతిపాదనలు పెడుతున్నారు.

వైన్సులతో ఒప్పందం.. టోకెన్ల జారీ

ఎన్నికల్లో మద్యం పంపిణీని నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ గట్టి చర్యలే చేపట్టింది. గెట్ టు గెదర్ పార్టీలకు నేరుగా మద్యం సరఫరా చేస్తే పోలీసులు పట్టుకునే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఎవరికీ అనుమానం రాకుండా ముందే తమ అనుచరులు, బంధువులు, బినామీల పేరుతో ఉన్న వైన్స్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా టోకెన్లు కూడా ముద్రించి ఇస్తున్నారు. అభ్యర్థి వెంట రోజంతా తిరిగిన ముఖ్య అనుచరులతో పాటు ఇతర నిర్వాహకులకు సాయంత్రం వేళ టోకెన్లు జారీ చేస్తున్నారు. వీరు ఆయా వైన్సుల వద్దకు వెళ్లి.. కావాల్సినంత మద్యాన్ని వెంట తీసుకెళ్తున్నారు. ఆత్మీయ సభలు, సమావేశాలకు హాజరయ్యే వారికి కూడా ఇదే విధంగా పంపిణీ చేస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ జిల్లాలోని వైన్స్‌షాపుల్లోని నిల్వలను ఏ రోజుకారోజు లెక్కిస్తున్నప్పటికీ.. వీరి లెక్కకు ఏమాత్రం కూడా చిక్కకుండా వ్యవహరిస్తుండటం విశేషం. ఒకవైపు అధికార బీఆర్‌ఎస్ అటు ప్రచారంలోనూ.. ఇటు ఆత్మీయ ఆతిథ్యంలోనూ దూసుకుపోతుండగా.. ప్రతిపక్ష అభ్యర్థులు మాత్రం ఇప్పటికీ టికెట్ పైనే టెన్షన్ పెట్టుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల్లోనూ ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు నుంచి పది మంది పోటీ పడుతున్నారు. అధిష్టానం ఆశీస్సులు ఎవరికి ఉంటాయో? పార్టీ బీ ఫాం ఎవరి చేతికి అందనుందో అనే ఆందోళన వారిని వెంటాడుతోంది.

గ్రేటర్.. ఓటర్

- రాష్ట్రంలో మూడోవంతు ఓటర్లు ఈ పరిధిలోనే ..
- ప్రభుత్వ ఏర్పాటులో వీరిదే కీలక పాత్ర
- రాజకీయ పార్టీల ప్రత్యేక దృష్టి



❖ మెజార్టీ ఓటర్లు చదువుకున్న వారే. పురుషులతో సమానంగా మహిళలు ఉన్నారు. యువత కూడా ఎక్కువే. అక్షరాస్యతలోనే కాదు ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ వీరు రాణిస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులపై వీరికి ఎంతో కొంత అవగాహన కూడా ఉంది. ఓటు హక్కుపై వీరికంటూ ఓ స్పష్టమైన అభిప్రాయం ఉంది. వీరి నాడి పట్టడం రాజకీయ పార్టీలకు అంత సులభం కూడా కాదు. వీరి ముందు ఎన్నికల తాయిలాలు కూడా పని చేయవు. వీరి ఓటు ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించనుంది. ఎన్నికల్లో వీరు తీసుకునే నిర్ణయంపైనే అభ్యర్థి గెలుపోటములు ఆధారపడి ఉండటంతో ప్రధాన పార్టీలన్నీ ఫోకస్ పెట్టాయి.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్ జిల్లాల ఓటర్లపై అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఫోకస్ పెట్టాయి. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా.. ఇక్కడి ఓటర్లు ఇచ్చే తీర్పే ప్రధానం కాబోతోంది. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా.. వీటిలో నాలుగు ప్రధాన జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి (పటాన్‌చెరు) గ్రేటర్ పరిసరాల్లోనే ఉన్నాయి. తెలంగాణ మొత్తంగా 119 నియోజకవర్గాలు ఉండగా.. ఈ నాలుగు జిల్లాల పరిధిలోనే 26 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3,17,32,727 మంది ఓటర్లు ఉంటే.. వీరిలో మూడో వంతు అంటే 1,01,61,560 మంది ఓటర్లు వీటి పరిధిలోనే ఉండటం విశేషం. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్, విపక్ష బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. రాష్ట్ర నేతలే కాదు.. ఢిల్లీ నేతలు సైతం గ్రేటర్ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా సభలు నిర్వహించబోతున్నారు. కుల, మత సంఘాల పెద్దలు, ఉద్యోగ, నిరుద్యోగ, యువజన, ఉద్యోగ, కార్మిక, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక్కడంతా భిన్నం..

నగరంతో పాటు చుట్టు పక్కల నియోజకవర్గాల్లో భిన్న వాతావరణమే కాదు.. విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు కన్పిస్తుంటాయి. ఐటీ, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడుతుండటంతో నగరం సహా శివారు జిల్లాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా కలిసిపోయి ఈ ప్రాంతం ఓ సెమీ అర్బన్‌గా అవతరించింది. ఇక్కడ తెలుగు మాట్లాడే వారే కాదు హిందీ, కన్నడ, తమిళం, ఒరియా, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ, మరాఠి, ఇతర భాషలు మాట్లాడే వారు ఉన్నారు.

వరుస స్థానాల్లో ఆ నియోజకవర్గాలు..

తెలంగాణలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాల జాబితాలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని శేరిలింగంపల్లి ముందు వరుసలో (6,98,133 ఓటర్లు) ఉండగా, ఆ తర్వాత స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం (6,69,361 మంది ఓటర్లు) ఉంది. మూడో స్థానంలో మేడ్చల్ (5,95,536 మంది ఓటర్లు) ఉండగా, నాలుగో స్థానంలో ఎల్బీనగర్ (5,66,866 మంది ఓటర్లు) ఉంది. ఇక ఐదో స్థానంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం (5,52,455) ఉండటం విశేషం. కేవలం ఈ ఐదు నియోజకవర్గాల పరిధిలోనే 30 లక్షల మందికిపైగా ఓటర్లు ఉండటం గమనార్హం. ఇక్కడ అభ్యర్థుల ఎంపికే ఆయా పార్టీలకు ఓ పెద్ద సవాల్‌గా మారింది.



సమావేశంలో మాట్లాడుతున్న రోనాల్డ్ రాస్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్


బంజారాహిల్స్: ఎన్నికల నిర్వహణలో సొంత నిర్ణయాలతో కాకుండా ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఎన్నికల విధులు నిర్వహించే ఆర్‌ఓలు, స్పెషల్ అధికారులు, నియోజకవర్గ స్థాయి ట్రైనింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిబంధనలు పాటించాలని అన్నారు. ప్రతి అంశానికి ఎన్నికల కమిషన్ స్టాండర్డ్ ఆఫ్ ప్రొసెడర్స్ రూపొందించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, అడిషనల్ కమిషనర్లు శంకరయ్య, శ్రీవత్స, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే తదితరులు పాల్గొన్నారు.

ఆచారి.. ఆరోసారి..

- కల్వకుర్తి నుంచి బీజేపీ తరఫున పోటీకి సిద్ధం
- రెండుసార్లు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలు
- ఈసారైనా విజయం వరించేనా?
- నియోజకవర్గంలో విస్తృత ప్రచారం



ఆచారి



ఆమనగల్లు: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఇప్పటికే ఐదుసార్లు పోటీ చేసిన ఆయన ఆరోసారి బరిలో నిలిచేందుకు అస్త్రశస్త్రాలు రెడీ చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఆయనకు పోటీ లేకపోవడంతో టికెట్ దాదాపు ఖరారైనట్లే అని చెప్పొచ్చు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిగా పేరున్న ఆయన విజయం అంచుల వరకూ వచ్చి ఓటమి చవిచూస్తున్నారు. ఈసారి విజయం ఖాయమని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

వార్డు సభ్యుడిగా ప్రస్థానం

ఆమనగల్లు పట్టణానికి చెందిన ఆచారి బీజేపీలో జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. 1984లో రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన తొలిసారిగా ఆమనగల్లు పంచాయతీ వార్డు సభ్యుడిగా పోటీచేసి విజయం సాధించారు. 1996లో ఆమనగల్లు మేజర్ పంచాయతీ సర్పంచుగా ఎన్నికై పట్టణ అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. మొదటినుంచి బీజేపీలోనే ఉన్న ఆచారి గ్రామ కమిటీ, మండల, నియోజకవర్గ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. నాలుగేళ్ల క్రితం జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులై మూడేళ్ల పాటు తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారు.

అలుపెరగని పోరాటం

నియోజకవర్గంలో ప్రజాసమస్యలపై ఆచారి అలుపెరగని పోరాటం చేస్తున్నారు. విభిన్న రీతిలో ఉద్యమాలు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. 1994లో తొలిసారి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి 8,682 ఓట్లు సాధించారు. 2004లో 54 వేల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2009లో అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 25 వేల ఓట్లకే పరిమితమయ్యారు. 2014 ఎన్నికల్లో విజయ తీరాల వరకూ వచ్చినా గెలుపును అందుకోలేకపోయారు. కేవలం 72 ఓట్ల స్వల్ప తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి చేతిలో ఓటమిచెందారు. అయినప్పటికీ నిరుత్సాహ పడకుండా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. 2018 ఎన్నికల్లో ఐదోసారి పోటీ చేసి 3 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

ఈసారైనా కలిసొచ్చేనా..?

కల్వకుర్తి నుంచి ఐదు సార్లు ఓటమిచెందిన ఆచారి ఆరోసారి బరిలో దిగనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రెండుమూడు నెలలుగా నిత్యం రెండు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుస్తున్నారు. 'ఒక్క చాన్స్ ప్లీజ్' అంటూ అభ్యర్థిస్తున్నారు. రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమి చెందిన ఆచారి ఈసారి కల్వకుర్తిలో కాషాయ జెండా ఎగరేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారు.

చేతికందేనా!

- నేడు కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా
- 10 నుంచి 16 స్థానాలకు అవకాశం
- ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ



సాక్షి,సిటీబ్యూరో: అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో నగర పరిధిలోని కొన్ని అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాల ఖరారుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. పోటీ ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు మినహాయిస్తే.. మిగతా చోట్ల అభ్యర్థుల ఖరారు దాదాపు పూర్తి కావడంతో ఆదివారం తొలి జాబితా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితమే స్క్రీనింగ్ కమిటీలో ఎంపిక చేసిన జాబితాకు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. మొదటి జాబితాలో గెలుపు గుర్రాలకు మాత్రమే ప్రాధాన్యత లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగరంలో పూర్వ వైభవం కోసం అభ్యర్థిత్వాల ఖరారుపై ఆచితూచి అడుగులు వేస్తునట్లు తెలుస్తోంది. సర్వేలు, ఫ్లాష్ సర్వేలు నిర్వహించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పాతబస్తీలోని నియోజకవర్గాలపై పెద్దగా ఆశలు లేనప్పటికీ మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చే సమర్థులైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ స్థానం నుంచి అలీ మస్కతీని ఎన్నికల బరిలో దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

తొలి జాబితాలో వీరికి చోటు?

కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాలో గ్రేటర్ పరిధిలోని 10 నుంచి 16 అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాంపల్లి అసెంబ్లీ స్థానానికి ఫిరోజ్‌ఖాన్, చార్మినార్‌కు అలీ మస్కతీ, ముషీరాబాద్‌కు అంజన్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్‌కు పి.విష్ణువర్ధన్‌రెడ్డి/అజహరుద్దీన్, ఖైరతాబాద్‌కు రోహిణ్‌రెడ్డి/వినోద్ రెడ్డి, సనత్‌నగర్‌కు కోట నీలిమ/మర్రి ఆదిత్య రెడ్డి, మేడ్చల్‌కు తోటకూర వజ్రేశ్ (జంగయ్య) యాదవ్, మల్కాజిగిరికి మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్‌కు కొలన్ హనుమంత రెడ్డి, ఉప్పల్‌కు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్బీనగర్‌కు మధుయాష్కీ గౌడ్, మహేశ్వరానికి చిగురింత పారిజాత, రాజేంద్రనగర్‌కు బొర్ర జ్ఞానేశ్వర్, శేరిలింగంపల్లికి మారబోయిన రఘునాథ్ యాదవ్, కంటోన్మెంట్‌కు వెన్నెల, పటాన్‌చెరుకు కాటా శ్రీనివాస్‌గౌడ్, అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి దసరా బ్రహ్మోత్సవాలు



అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ప్రత్యేక పూజలతో పాటుగా ప్రతీ రోజు 7 గంటలకు స్వామి వారికి వాహన సేవలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 22న ఆదివారం ఉదయం 10గంటలకు గరుడ వాహన సేవ, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం దసరా సందర్భంగా సాయంత్రం 4గంటలకు అశ్వవాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుందని వివరించారు. 5 గంటలకు ఆలంపల్లి మైదానంలో రావణ దహనం ఉంటుందని, అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో స్వామి వారి వాహన సేవ కొనసాగుతుందన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ

షాద్‌నగర్ రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదుతో పాటు సామాగ్రిని దోచుకెళ్లారు. పట్టణంలో భగత్‌సింగ్ కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉండే పాత్లావత్ రవి కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. అయితే శనివారం ఉదయం తిరిగి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి, రూ.45వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

హత్యకేసులో నలుగురు అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: హత్య ఘటనలో నిందితులను 24 గంటల్లోనే ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం, పోర్లగడ్డ తండాకు చెందిన సీతారాంను అతని బామ్మర్ది శుక్రవారం ఉదయం మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఇనుపరాడ్డుతో కొట్టి హతమార్చాడు. ఈ ఘటనంలో అంగోతు సాయికుమార్(24), మీనం అనిల్(30), అంగోతు తరుణ్(22), పర్సమోని అశోక్ అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, వారి నుంచి మహేంద్ర మిరాజో కారు, రెండు సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- వచ్చేలోపు ఇల్లు గుల్ల కావొచ్చు
- బ్యాంకు లాకర్లలోనే నగలు, డబ్బులు భద్రం
- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ
- ప్రయాణ సమయాల్లో జాగ్రత్తలు అవసరం
- ప్రజలకు పోలీసుల సూచనలు



షాద్‌నగర్: దసరా పండుగ సెలవులు ప్రారంభం అయ్యాయి. విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చేశారు. సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబాలతో సహా ఊర్లు వెలుతున్నారా? ఊరెళ్లే హడావుడిలో చాలా మంది ఇంటి భద్రత గురించి పట్టించుకోరు. అజాగ్రత్తగా ఉంటే అంతే.. మీ ఇల్లు గుల్ల అవుతుంది. పండుగ వేళల్లో ఇంటికి తాళం వేసి కన్పిస్తే దొంగల కన్ను పడుతుంది. సుదూర ప్రాంతాలకు పయనమయ్యేవారు. పండుగ నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవల్సిందేనని పోలీసులు చెబున్నారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

పోలీసుల సూచనలు

- పండుగకు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంటి దగ్గర నమ్మకమైన సెక్యూరిటీ గార్డును పెట్టుకోవాలి.
- బీరువాలు, అల్మారా, కప్‌బోర్డుల తాళాలను రహస్య ప్రదేశంలో ఉంచాలి.
- మీ ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి లాక్ వేయాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.
- మీరు బయటికి వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.
- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100 డయల్ చేయాలి.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం తాళంను అమర్చుకోవాలి.
- ఇంటికి ఇరువైపులా నమ్మకమైన వారు ఉంటే మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లాలి.

బ్యాంకుల్లోనే భద్రం

ఎంతో కష్టపడి కొనుగోలు చేసిన నగలు, సంపాదించిన డబ్బులు పోతే ఆ బాధ వర్ణనాతీతం. అలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలంటే ఊరెళ్లే ముందు ఇంట్లో ఉన్న నగలు, నగదును బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవడం మంచిది. లాకర్లు లేని వారు తమకు తెలిసిన వారి ఇళ్లలో, బంధువుల దగ్గర భద్రపర్చుకోవాలి. పోలీసులు కూడ ఇదే విషయాన్ని చెబుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలా నగలు, నగదు, పత్రాలు దాచిపెట్టుకోవడం వల్ల ఆందోళన చెందకుండా సంతోషంగా పండుగను జరుపుకోవచ్చు.

జాగ్రత్త అవసరం

ప్రయాణంలోనూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే దొంగలు మన పక్కనే ఉండి గమనిస్తూ అదును దొరకగానే డబ్బులు, నగలు సామాగ్రితో ఉడాయిస్తారు. బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రయాణిస్తున్నప్పుడు చాలా మంది సీట్లలో బ్యాగులను వదిలి తినుబండారాలు, తాగునీటి కోసం బస్సులు దిగుతుంటారు. ఇలాంటి సమయంలోనే దొంగలు అపహరించుకుపోతారు. ప్రయాణాల్లో మహిళలు, చిన్నారులు బంగారు ఆభరణాలు ధరించకపోవడమే మంచిది. అదేవిధంగా కార్లలో వెళ్లే వారు కూడ మధ్యలో ఆపి హోటళ్లకు వెళ్తుంటారు. దొంగలు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న సామాగ్రిని ఎత్తుకుపోతుంటారు. దొంగతనాల నివారణపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడ ప్రజలకు సూచనలు చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలి. దొంగతనాల నివారణకు ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశాం.

– ప్రతాప్ లింగం, సీఐ, షాద్‌నగర్ పట్టణం

అప్రమత్తంగా ఉండాలి



విలువైన బంగారు నగలు, డబ్బులు, విలువైన పత్రాలు బ్యాంక్ లాకర్‌లలో భద్రపర్చుకోవాలి. బస్సు, ఇతర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

మద్యం సీజ్.. కేసు నమోదు

తలకొండపల్లి: పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బెల్ట్ షాపులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఖానాపూర్ గ్రామంలో లక్ష్మయ్య అనే వ్యక్తి కిరాణా షాపులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు: కోనాపురం గ్రామంలో రాములు అనే వ్యక్తి నిర్వహిస్తున్న కిరాణా షాపుపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుడు అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో శనివారం కిరాణాషాపులో తనిఖీ నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీల్లో 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. అనుమతిలేకుండా మద్యం విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

పదవులు ముఖ్యం కాదు

- కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్సీ

కడ్తాల్: తనకు పదవులు ముఖ్యం కాదని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గానుగుమార్లతండా, కానుగుబావితండాలో 'గడప గడపకు కాంగ్రెస్' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై.. గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పనితీరుతో కల్వకుర్తి నియోజకవర్గం అత్యంత వెనుకబాటుకు గురైందని, అభివృద్ధి చెందలేదని విమర్శించారు. నియోజకవర్గంలో సాగునీరు, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని కసిరెడ్డి సవాల్ విసిరారు. ప్రజలు, కార్యకర్తల, నాయకుల ఒత్తిడి మేరకే కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేసే నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ప్రచారంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

గడప గడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గానుగుమార్లతండాలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్థానిక సర్పంచ్ హంశ్యమోత్యానాయక్, నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్‌అధ్యక్షులు బీచ్యానాయక్, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.